# వ్యాస కౌముది



## సాహిత్య నమూనాలు

వెల్చేరు చంద్రశేఖర్

*నా జీవితం ఇప్పటికి 100 శాతం అనుకుంటే, అందులో 30 శాతం నా వృత్తికి ఎందుకూ ఉపయోగ పడని, విలువ నివ్వని, (ఇందులో పేరు డబ్బు కూడా కలిసివున్నాయి.) తెలుగు ఆంగ్ల హిందీ సాహిత్యాన్ని చదివాను, పోషించాను (పుస్తకాలు కొని ) అంతో ఇంతో రచనలు చేసాను.*

*ఈ ప్రక్రియలో నాలా కాకుండా సాహిత్యంలో వివిధతో పేరు తెచ్చుకున్న వారిని అనుసరించి వారితో జీవించి, పరిశీలించి నా అభిప్రాయాల్ని మార్చుకుంటూ వచ్చా, కానీ ఇప్పుడు సాహిత్య పరిస్థితి చికాకు కలిగిస్తోంది. అదెలా తెలియచెయ్యాలో తెలియక, నా చికాకుని రాయడం మొదలు పెట్టా, సాహిత్యం ఏమిటి? అన్న ప్రశ్న అదెందుకు సమాజాన్ని ప్రభావితం చెయ్యలేకపోయింది?, అని ఆలోచించుకుంటే మనం ఎక్కడో తప్పులో కాలేసాం అనిపించింది.*

*ఆ కాలు నా అంతట నేను వెయ్యలేదు. సాహిత్యబ్యాసం చేయించిన పెద్దలు నన్ను ప్రభావితం చెయ్యాలని వాడిన రంగులప్రభావం. అవి కడుక్కోడానికి, నా జీవితానుభవం పనికొచ్చింది. ఎందుకంటె నేను రచయితగా కొంతమంది ఎడిటర్స్ ని (కొలమానిని)( అంటే మనకి యెంత జ్వరం ఉందొ చూసే ధర్మా మీటర్స్ అన్నమాట ) ఆకర్షించాను. అందులో రచన సాయి గారు, పురాణం శర్మగారు, రాజేంద్రగారు, తానావారు, కిరణప్రభగారు, అందుకని సాహిత్యం మీద విమర్శనా పుస్తకాలు చదివి, నాది అన్న ఒక విమర్శ మొదలు పెట్టా, అది కిరణప్రభగారిని చికాకు పెట్టింది, ఎందుకంటె ఆయన టాక్ షో లు వింటున్నాను కాబట్టే, నాకు ఆ విషయం స్పష్టంగా అర్ధం అయింది. అయినా నేను నేనే కాబట్టి---,*

*ఆనాటి 1970,1980,1990 లో సాహిత్యం పట్ల వుత్సాహం రేకెత్తించిన రచయితల్ని, అంటే విశ్వనాథ, గురజాడ, చలం, గోపీచంద్, బుచ్చిబాబు, కారామాస్టారు, రావిశాస్త్రి వగైరా, వారిపై పాత విమర్శల్ని, కొత్త కొలమానాలతో (అంటే నావి) కొలుద్దామనే ప్రయత్నం చేశా? అందుకే చిన్న వివరణ )*

## అవలోకనం

అవలోకనం అంటే దర్శనం, లక్షణం, లేదా జరిగిన సంగతి కనిపెట్టుట. Lying with approximation అన్న ఇంజనీరింగ్ భావన [concept] ఆధారంగా సాహిత్యావలోకనం చేయడమే నా వ్యాసపరంపర ముఖ్యోద్దేశం. నా సాహిత్యావలోకానికి లేక శోధనకు కొందరు ప్రముఖ సాహితీవేత్తలను ఎంపిక చేసుకున్నాను. నాకు సాధ్యమైనంత మేరకు వాళ్ళ రచనలు అర్థంచేసుకున్నాను. నాకు గమనికకు వచ్చిన అంశాలను మీ ముందు ఉంచుతాను.

నా వృత్తి వేరు ప్రవృత్తి వేరు. వృత్తి ఇంజనీరింగ్ విద్యను ఆచార్యుడుగా కళాశాల విద్యార్థులకు బోధించడం. ప్రవృత్తి సాహిత్యం –వ్రాయడం, చదవడం. బొల్డు సాహిత్యం చదివా, అది ఇది అననేలా: డిటెక్టీవ్ పుస్తకాలు, శృంగార పత్రికలు, బూతు పుస్తకాలు, సాంఘిక, జానపద నవలలు, మేధోమథనం నుంచి పుట్టిన మరియూ చదువుతున్నపుడు మేధకు పనిచెప్పే రచనలు, సిద్ధాంత గ్రంధాలు, అక్షరరూపంలోని రాద్ధాంతచర్చలు, అనుభవాలు ఆలోచనా తరంగాలు. వృత్తికి సంబంధించిన గ్రంథాలు సరేసరి; ఇవి చదువుతున్నపుడు ఉపోద్ఘాతాలను కప్పదాటుగా ఒదిలేవాడిని కాను. చదవడం ఒక యోగంలా భావించేవాడను కాబట్టి నేను యోగిని. చదవడం ఒక భోగం కూడా కనుక నేను భోగిని. ఈ విషయాలు ఇలా ఉంచితే...,

ద ఫైనైట్ ఎలిమెంట్ మెథడ్ [The Finite Element Method] అన్న ఇంజనీరింగ్ పుస్తకపు ఉపోద్ఘాతంలో ప్రపంచంలో కనబడుతున్న మోడల్స్ (నమూనాలు) అన్ని (1) 70 శాతం నుండి 90 శాతం మాత్రమే నిజమైనవి లేదా పనిచేస్తాయి, (2) అంటే 30 నుండి 10 శాతం నిజమైనవి కావు లేక పనిచేయవు అని చెప్పబడింది. ఈ రెండవ విషయం పట్టించుకోరు; పట్టించుకుంటే మోడల్ని తయారు చెయ్యలేరు. ప్రస్తుతం కరోనా వాక్సిన్ కూడా అలాంటి ఓ మోడల్. ఆ సత్యాసత్యాల ఆలింగనాన్ని, ఆ రచయిత లయింగ్ విత్ అప్రోక్సిమేషన్ (Lying With Approximation) అంటే ఉజ్జాయింపు అబద్ధం పేరు పెట్టాడు. అంటే మనం తయారు చేసిన మోడల్ లో అంతో ఇంతో అబద్ధం వుంది, అని వేరే చెప్పనక్కర్లా.

సాహిత్యంలో కూడా అబద్ధాన్ని మేళవించిన నిజం లేక నిజాన్ని మేళవించిన అబద్ధపు నమూనాలు లేక తుది నిర్ణయాలు [conclusions] ఉన్నాయా అన్నసందేహం నాకు కలిగి శోధన ఆరంభించాను. నా నమూనాలు వంద శాతం తెల్లటి సత్యాలు అని నేను ప్రకటించే సాహసం చేయడం లేదు.

గీత ఇలా అంటుంది:

ఇంద్రియాణి పరాన్యాహు ఇన్ద్రియేభ్యహః పరం మనః

మనసస్తూ పరా బుద్ధీహి ర్యో బుద్ధే పరతస్తు స:

అంటే: ఇంద్రియాలు విషయసేకరణ చేస్తాయి; వాటిని మనసు అవగాహన చేసికుంటుంది; సంస్కరణలో భాగంగా బుద్ధి తనకి కావలసినవి తాను చెప్పదలుచుకున్నవి మాత్రమే తీసుకుంటుంది. అక్కడ నుండి కళారూపంలో బైటకి వదులుతుంది. అంటే ఇంద్రియాలు సేకరించినదానిలో ఎంతో కొంత శాతం కత్తెరకు గురౌతుంది. ఏది, ఏ మేరకు కత్తెరకు గురైంది? ఇంద్రియాలను త్రోసిరాజని బుద్ధి సమాచారసేకరణ చేయ లేదు. మరి ఇంద్రియాలు సేకరించినదాని మీద బుద్ధి ఆధారపడుతుంది కనుక బుద్ధి సంస్కరించినదైనా నమ్మదగినదేనా?

గతి తర్కతార్కిక అంశపు ఉనికిని ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి. ప్రతిదీ ద్వంద్వాల కలయికే; అందుకే భౌతికవాదుల, నాస్తికుల వాదనలో పరస్పర వైరుధ్యం ఉండక తప్పదు. ఆకలి గుణం, దాని తీవ్రత అందరిలోనూ అన్నిజీవులలోనూ ఒకేలా ఉండవు. తీసుకునే ఆహారంలోనూ తేడాలుంటాయి. కానీ జీవులన్నిటినీ, మనుషులందరినీ ఒకేగాట కట్టేసి ప్రక్రియకు పూనుకుంటుంటారు కొందరు. పోలీసులు ఎవరిని కాపాడుతున్నారు అని ప్రశ్నించడం ద్వారా ఒక నియంత్రణా వ్యవస్థనడవడిని ప్రశ్నార్థకానికి గురిచేయడం జరుగుతుంది; అలా అని కొన్ని సంఘటనల విషయంలో ప్రశ్నించకుండా ఉండటం సాధ్యపడదు. రాజకీయంగా మనం ఎవరిని నమ్మాలి? అని ప్రశ్నించినపుడు రాజకీయంలో ఒక తేడా సృష్టించడం జరుగుతుంది. మనం చదువుకునే చదువు మనకి యే సంస్కారం నేర్పుతోంది? అని ప్రశ్నిస్తే మనం నేర్చుకుంటున్న విద్య పై శంకను వ్యక్తంచేసినట్టు అవుతుంది. ఆరోగ్యకరమైన ప్రశ్నించే గుణం నలుగురు ఆలోచించే ప్రయత్నానికి పూనుకునేదానికి వీలవుతుంది.

పైన పేర్కొన్న విధమైన చింతన ఏ రచయిత మనసునైనా ఆవహించిన తరువాత రచనలు చేస్తే సంఘంపట్ల, వ్యవస్థపట్ల, సమస్యపట్ల పాఠకులలో సరైన అవగాహనకు తావిస్తుంది. సాహిత్యం కేవలం అవగాహనకి కాక కళాత్మక విలువలకూ పెద్ద పీటను వేసేలా ఉండాలి – కళ కళ గురించే వుంది అని కొట్టిపారేయలేకపోతే.

వొడ్డునకుర్చుని ఏలా ఈదాలి అనే పుస్తకాలు తెగ చదివి, ఈత నేర్పుతాను అంటే కుదరదు; ప్రజలు నమ్మరు. నువ్వు ఈదినప్పుడు నిజానిజాలతో ప్రత్యక్ష అనుభవం సిద్ధిస్తుంది; నీ సామర్థ్యం పై, నిజాయతీపై ఇతరులకు విశ్వాసం కలుగుతుంది. బుద్ధే పరతస్తు సః అలా చెప్పినవాడితో మన బుద్ధిని పక్కకు పెట్టి ప్రయాణం చేస్తాం

సామాజిక మార్పు సాహిత్యం ద్వారా సిద్ధిస్తుందా అంటే అది హుళక్కి. సామాజిక మార్పు సహజసిద్ధమైనది. ఏ వ్యక్తయినా నిమిత్తమాత్రుడే. అందుచేత సాహితీవేత్తలు బొరలు విరుచుకోనక్కరలేదు. దీపాలపిచ్చయ్య శాస్త్రి గారు ఎనభై ఏళ్ళనాడు వ్రాసిన ఈ కవితను, దానిలోని "ప్రకృతిసిద్ధంబు మార్పు ప్రపంచమునకు" అన్న వాక్యాన్నీ నేను మెచ్చుతాను. ఏయే మార్పులు మానవ మనుగడలో జరుగిగాయి, జరుగుతాయో ఆ చక్కని కవితలో చెప్పారు. సహజసిద్ధమైన మార్పు అనేప్రవాహంలో ఏ వ్యక్తీ "ససేమిరా" నేను మారను అనే ప్రసక్తే లేదు.

ప్రభులు మాఱిరి ప్రభు ధర్మములు మాఱె

రాజ్యములు మాఱె, రాజ్య తంత్రములు మాఱె

ప్రజలు మాఱిరి ప్రజల భావములు మాఱె

ప్రకృతి సిద్ధంబు మార్పు ప్రపంచమునకు

మాఱకుండు పదార్థ మీ మహిని సున్న

మార్పెరుంగనిదొక్క బ్రహ్మంబు దక్క...

సహజసిద్ధమైన మార్పు నేపథ్యంలో, సాహిత్య నమూనాలలోని అబద్ధపు భాగాల గురించీ ముచ్చటించదలచాను.

నమూనాలు అంటే ఏమిటి? ఎందుకు? ఎలా నిర్మించబడతాయి? మనం వొక మోడల్ తయారు చేసేముందు పరిగణలతో (assumptions) మొదలుపెట్టి మోడల్ తయారయ్యాక దానికి పరిమితులు (limitations) నిర్దేశిస్తాము. వాటికి లోబడి ఈ మోడల్ 70 నుండి 90 శాతం చెల్లుబాటు అవుతుంది అనుకున్నాము గదా. మోడల్ లో 10 శాతం అబద్ధమేగ. సైన్స్ లో సాంకేతిక విద్యలో ఈ పద్ధతి బాగా చెల్లుబాటులో వుంది. (ప్రస్తుతం కరోనా వాక్సిన్ కూడా ఓ మోడల్ )

అలాంటి నమూనా మన జీవిత సంబంధమైనదయితే జడం లేదా గమనం అనే రెండు గుణాలు కాకుండా చైతన్యం దానికి ఆపాదిస్తే, జీవిత నమూనాలో యెంత అబద్ధం ఉంటుందో ఊహించండి! ఏ రెండు ఆలోచనల మధ్య గల వ్యత్యాసం, లోతు, ప్రత్యేకతలు, తేడాలు, మోడల్ రూపంలో తేవాలంటే యెంతో కష్టం!

మన ఆలోచనలు సార్వజనీకంగా భావిస్తూ మనకి కనిపించిన ఘటన లేదా సంఘటన మనలో రేపే ఆలోచనలకి శిల్ప, కథ, ఉపన్యాసం, సినిమా, గాన రూపాలు ఇస్తాం; దాని ఆమోదయోగ్యత గురించీ మెరుగులు దిద్దుతాం. దీనిలో భాగమే అపోహలు (misinterpretations) నాటకీయత (dramatisation). ఆఖరిని పరిధులు కూడా విధిస్తాము – ఉదాహరణకు: ఎవరైనా తిరగబడాలంటే, విప్లవించాలంటే వాడు కార్మికుడు లేక శ్రామికుడే అయుండాలి అనే కంక్లూషన్ ఇచ్చేస్తాం. పరిధులకి అపోహలకు లోబడి తాను సృష్టించిన సాహిత్యం ఫలితం ఇస్తుందని ఓ చెల్లుబాటు/విలువ చీటీ నమూనాకు అంటిస్తాం. దాని నిజమైన విలువ 70 శాతం నుండి 90 శాతం వరకు ఉంటే గొప్పే! మిగిలిన శాతం అబద్ధమనేగా?

రచయిత విన్న విషయంమీద, చూసిన సంఘటన గురించో, అనుభవంలోకి వచ్చిన స్పందన లేదా వేదన గురించో, అక్షరరూపం ఇద్దాం అనుకున్నప్పుడు ఒక చిత్రం, ఒక ఆకారం మనోఫలకం మీద ఏర్పడి రూపుదిద్దుకుంటుంది ఆ చిత్రం లేదా ఆకారం రచయిత విన్న విషయాన్నీ చూసిన సంఘనని కదా రాస్తాడు అది ఎంతవరకు నిజం? దాని ఉద్దేశ్యం ఏమిటి? అని విమర్శ చాలామంది చేశారు నేనూ చేసాను. వ్యాసాలన్నీ ఈ విషయం మీద ఉంటాయి.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

# COMMENTS